

గృహజ్యోతిపై ఆందోళన

తెల్లరేషన్ కార్డు ఉండి, ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నా కొందరికి 'జీరో' బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 8లో




'సాగర్'లోకి గోదావరి జలాలు

కృష్ణా జలాలు పారుతున్న సాగర్ కాల్వల్లోకి గోదావరి నీటిని మళ్లించాలనే ఆలోచన కార్యరూపం దాలుస్తోంది. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రిపూట వాతావరణం కొంత చల్లబడుతుంది.



న్యూస్‌రీల్

ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం



తిరుమంజన వేడుకలో ఉత్సవమూర్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజన వేడుక నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు ఖమ్మంలోని స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 100 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. టీటీసీ లేదా బీఈడీ ఉత్తీర్ణులై టెట్ అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 26వ తేదీలోగా టీఎస్ ఎస్సీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన వారికి ఏప్రిల్ 3నుండి జూన్ 2వ తేదీ వరకు ఖమ్మంలో శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

డీఆర్‌డీఓ విద్యాచందన



సులానగర్‌లో నర్సరీని తనిఖీ చేస్తున్న డీఆర్డీఓ

టేకులపల్లి: నర్సరీల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం చేయొద్దని డీఆర్డీఓ విద్యాచందన అన్నారు. మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్, సులానగర్, గొల్లపల్లి గ్రామాల్లోని హరితహారం నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు రాని సంచుల్లో ఇతర రకాల విత్తనాలు నాటాలని, షిఫ్ట్ గ్రేడింగ్ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. గొల్లపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరావు, ఏపీఓ కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు శ్వేత, పవిత్ర, ఉమామహేష్, టీఏ ధనలక్ష్మి, బీముడు, ఎఫ్‌ఏలు లకాన్, బాలాజీ పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పాల్వంచ : కేటీపీఎస్ ఐదో దశలో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా మంగళవారం పదో యూనిట్‌లో 250 మెగావాట్ల ఉత్పత్తిని నిలిపివేశారు. కాగా, సీఈ ఎం.ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి బుధవారం పునరుద్ధరించారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈమేరకు 21 ప్రొఫెసర్ పోస్టులు, 25 అసోసియేట్ ప్రొఫెసర్, 24 అసిస్టెంట్ ప్రొఫెసర్, 31 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తెగ తోడేస్తున్నారు..

గోదావరి ఏజెన్సీలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రాత్రీ పగలు తేడా లేకుండా అడవుల్లో, రెవెన్యూ భూముల్లో గ్రావెల్‌ను ఎడాపెడా తోడేస్తోంది. గృహావసరాల కోసం ఎవరైనా అడవిలోంచి కర్రపుల్లను ఏరుకొస్తే కన్నెర్ర చేసే అటవీశాఖ అధికారులు గ్రావెల్ మాఫియా జోలికి వెళ్లడం లేదు. రెవెన్యూ అధికారులు సైతం గ్రావెల్ గద్దలను చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు. దీంతో పది రోజుల క్రితం అర్ధరాత్రి వేళలో మొదలైన దందా ఇప్పుడు పట్టపగలే యథేచ్ఛగా సాగుతోంది. జిల్లాలో ఇటు ఇసుక, అటు మట్టి అక్రమంగా దోచేస్తోన్న మాఫియాపై గత మూడు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. వాగులు, నదుల వెంట గస్తీ పెంచింది. ప్రధాన రహదారులపై తనిఖీలు ముమ్మరం చేసింది ఫలితంగా అనేక కేసులు నమోదవుతున్నాయి. అయితే ఈ తరహా కఠిన చర్యలేమీ చర్ల మండల దరిదాపుల్లో కనిపించడం లేదు. అక్కడ పట్టపగలే ప్రభుత్వ, అటవీశాఖ భూముల్లో ఉన్న గుట్టలను అక్రమార్కులు భారీ యంత్రాలతో తొలిచేస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

గోదావరి తీరంలో మట్టి మాఫియా

- రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వకాలు
- కరిగిపోతున్న కొండలు, గుట్టలు
- పట్టించుకోని రెవెన్యూ, అటవీ శాఖలు





అటవీ భూమిలో పొక్లెయినర్‌తో గ్రావెల్ తోడుతున్న దృశ్యం (ఇన్‌సెట్) చర్ల మండలం కలివేరు సమీపంలో కరిగిపోతున్న మట్టి గుట్ట

భారీ యంత్రాలతో

చర్ల మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కలివేరు గ్రామ సమీపంలో అటవీ, రెవెన్యూ శాఖలకు నడుమ ఉన్న గుట్ట గడిచిన పది రోజులుగా క్రమంగా కరి మింగిన వెలగ పండులా కరిగిపోతోంది. రాత్రి పది దాటితే చాలు భారీ పొక్లెయినర్లు, జేసీబీలు, టిప్పర్ల భీకర శబ్దాలు చేస్తూ కలివేరు సమీపంలోని గుట్టల్లోకి వెళ్లిపోతాయి. జేసీబీలు ఎడాపెడా గుట్టను తొలిచేస్తుంటే టిప్పర్లు, ట్రాక్టర్లు అలుపెరగకుండా రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే గ్రావెల్ మట్టిని అక్కడి నుంచి తరలించే పనిలో నిమగ్నం అవుతున్నాయి. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఇదే తంతు కొనసాగుతోంది.

కళ్లు మూసుకున్నారు..

రోడ్లు, ఇతర అవసరాలకు గ్రావెల్ కావాల్సిన వారు ఎంపిక చేసిన స్థలంలో తవ్వకాలు చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలి. సర్కారు నిర్ణయించిన విధివిధానాలకు అనుగుణంగా మట్టి తవ్వాలి. ఏజెన్సీలో అయితే అనుమతి తీసుకున్నా భారీ యంత్రాలు ఉపయోగించేందుకు వీల్లేదు. అటవీ శాఖ భూముల్లో అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు చేపట్టకూడదు. ఇలాంటి పనులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించడం, అవసరమైతే పర్మిట్లు, లైసెన్సులు రద్దు చేసే అధికారం ప్రభుత్వ అధికారులకు ఉంది. కానీ ప్రస్తుతం గోదావరి తీరం వెంబడి ఏజెన్సీలో ప్రభుత్వ చట్టాల అమలు తూతూ మంత్రంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిండవుతున్న కొండలు..

మట్టి మాఫియా దెబ్బకు కళ్ల ముందే కొండలు పిండవుతున్నాయి. ఒకప్పుడు ఠీవీగా కనిపించిన కొండ.. మట్టి మాఫియా దెబ్బకు రోజుకో విధంగా రూపు కోల్పోతోంది. కొండలనే కరిగించేస్తున్నా పట్టించుకునే వారు లేకపోవడంతో ఇన్నాళ్లు నిశ్శబ్దంగా ఉన్న మట్టి మాఫియాలోని మరికొన్ని టీమ్‌లు ఇప్పుడు చురుకుగా మారాయి. తమ ఇలాఖాల్లో మట్టిని కొల్లగొట్టడం ప్రారంభించాయి. కళ్ల ముందే అక్రమ దందా జరుగుతుంటే పట్టించుకోకపోయినా పర్వాలేదు.. కనీసం రాత్రి వేళ భారీ శబ్దాలతో తిరుగుతున్న టిప్పర్లు, టేపు రికార్డు పాటలతో మోతెక్కిస్తున్న ట్రాక్టర్లను అయినా కట్టడి చేస్తే కాస్త ప్రశాంతంగా నిద్రపోతామని స్థానికులు వేడుకునే స్థాయిలో ఇక్కడ అక్రమార్కుల వాహనాలు రొద పెడుతున్నాయి.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్



మణుగూరులో మాట్లాడుతున్న ప్రతీక్‌జైన్

మణుగూరు రూరల్/మణుగూరుటౌన్: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ కోరారు. మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కాగా, మణుగూరు మండలం కొత్త కొండాపురంలో యువకుడు కోడి నాగరాజు ఏర్పాటుచేసిన నాటుకోళ్ల గ్రీన్ ఫామ్‌ను పీఓ ప్రతీక్‌జైన్ ప్రారంభించారు. స్వయం ఉపాధి కోసం యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ సముదాయంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలించిన ఆయన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీటీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వారావుపేట: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ), ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి డి.వేణుగోపాల్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ప్రతి బుధవారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఓట్ల మార్పులు, చేర్పులు ఇతర సలహాలకు రాజకీయ పార్టీల నాయకులు స్వేచ్ఛగా రావచ్చని సూచించారు. ఈ ఎన్నికల్లో కూడా దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వారు ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1, 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు వరంగల్, ఖమ్మం, నల్లగొండ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఫాం 18 ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, రాజకీయ పార్టీల నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, కట్రం స్వామిదొర, ఎస్కే సలీం, సత్యవరపు సంపూర్ణ, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

పాల్వంచరూరల్: మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అర్చకులు, ఈఓ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేణుగోపాల్ దంపతులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈఓ రజనీకుమారి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

నియామక పరీక్షల బాధ్యత ఈడీసీఐఎల్‌కు..

- ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యసాధనకు చేరువయ్యాం..
- సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.వీ.కే.శ్రీనివాస్



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా చేపట్టేలా దేశంలో పేరుగాంచిన ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్(ఈడీసీఐఎల్) – మినీ రత్న కంపెనీకి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నామని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.వీ.కే శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈడీసీఐఎల్ ఇప్పటికే కేంద్ర, రాష్ట్రాల పరిధిలో పోలీస్, మిలటరీతోపాటు అనేక నియామకాల పరీక్షలకు 44లక్షల మంది హాజరైనా.. ఎలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించి ఫలితాలు వెల్లడించిందని తెలిపారు. దీంతో సింగరేణిలో చేపడుతున్న నియామక పరీక్షల బాధ్యత కూడా ఈడీసీఐఎల్‌కు ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా, సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఈనెల 12వ తేదీ వరకు 65.41 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని, మిగిలిన ఉత్పత్తి కూడా పూర్తిచేసేలా కృషి జరుగుతోందని తెలిపారు. ఇక సంస్థ ద్వారా రానున్న రెండేళ్లలో 550 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయని వివరించారు. ఈ సమావేశంలో అధికారులు కట్టా బసవయ్య, బి.హన్మంతరావు, ముకుంద సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట అభ్యర్థిగా సీతారాంనాయక్

- రెండో జాబితాలో ప్రకటించిన బీజేపీ
- ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కమలం గూటికి చేరిన మాజీ ఎంపీ



సీతారాంనాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, ప్రొఫెసర్ సీతారాంనాయక్ బరిలో నిలవనున్నారు. ఈ మేరకు బుధవారం బీజేపీ కేంద్ర కార్యాలయం రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో తెలంగాణ నుంచి ఆరు స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేయగా.. మానుకోట నుంచి సీతారాంనాయక్‌కు అవకాశం కల్పించింది. మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో జిల్లాలోని ఇల్లెందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

బీఆర్‌ఎస్‌ను వీడి..

ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన అజ్మీర సీతారాంనాయక్ కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. దీంతో 2014 ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని బీఆర్‌ఎస్ కల్పించింది. ఆ ఎన్నికల్లో గెలుపొందిన సీతారాంనాయక్ ఐదేళ్ల ఎంపీగా పని చేశారు. ఆ తర్వాత ఎన్నికల్లో నాయక్‌కు బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించింది. త్వరలో జరగబోయే ఎన్నికల్లోనూ ఆయనకు కారు పార్టీలో సీటు దక్కలేదు. దీంతో బీఆర్‌ఎస్ అధినాయకత్వం పట్ల సీతారాంనాయక్ అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ములుగు జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీతారాంనాయక్‌తో సమావేశమయ్యారు. ఆయన రాజకీయ భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. దీంతో బీఆర్‌ఎస్‌ను వీడిన సీతారాంనాయక్ కమలం పార్టీలో చేరారు.

చేరిన వెంటనే..

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేసేందుకు నిన్నామొన్నటి వరకు నాయకుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. మాజీ ఐఏఎస్ రామచంద్రునాయక్‌తో పాటు గతంలో పోటీ చేసిన జాటోత్ హుస్సేన్‌నాయక్ తదితరులు పోటీ పడ్డారు. ఇటీవల జాతీయ ఎస్టీ కమిషన్‌లో జాటోతు హుస్సేన్‌నాయక్‌కు ఆ పార్టీ స్థానం కల్పించింది. దీంతో సీతారాంనాయక్‌కు లైన్ క్లియర్ అయింది. ఇప్పటికే ఈ స్థానం నుంచి బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత, కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్ పోటీకి సిద్ధమయ్యారు. మూడు ప్రధాన పార్టీలూ అభ్యర్థులను ప్రకటించడంతో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ వేడి రాజుకుంది.

బీటీపీఎస్ కీర్తిని పెంచాలి

సీఈ బిచ్చన్న



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ

మణుగూరు రూరల్: ఉద్యోగులు తమ క్రీడా నైపుణ్యంతో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) కీర్తి ప్రతిష్టలను పెంచాలని సీఈ బి.బిచ్చన్న పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(కేటీపీపీ)లో జరిగిన గత ఐదు రోజుల పాటు జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ ఉద్యోగులు తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు సీఈని బుధవారం మర్యాదపూర్వకంగా కలవగా ఆయన క్రీడాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. టీఎస్ జెన్‌కో సంస్థ క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, క్రీడా, కళారంగాల్లో రాణిస్తూ మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నరసింహారావు, అకౌంటెంట్ బాబురావు, డీఈలు సత్యనారాయణ, మురళీకృష్ణ, క్రీడాకారులు ఉదయ్‌కిరణ్, అశోక్‌రెడ్డి, కార్తీక్, హేమమూర్తి, డి.రమేష్, గోపాలకృష్ణ, అనిల్‌కుమార్, ప్రేమ్, సంపత్, వెంకటేశ్వర్లు, తిరుపతి, ప్రవీణ్, భరత్, నవీన్, రవి, మేనేజర్ ఎం. నాగేశ్వరరావు, సత్యనారాయణ, రాజబాబు, రాయ్‌సాబ్, గని, సురేష్, సతీష్‌రెడ్డి, రాజశేఖర్, మహేష్, మైనుద్దీన్ పాల్గొన్నారు.

పత్తి ధరలు పైపైకి..

బూర్గంపాడు: రైతుల చేజారిన తర్వాత పత్తి ధర పెరుగుతోంది. ఇటీవలి వరకు క్వింటా రూ. 6,500 ఉండగా.. ప్రస్తుతం రూ.7,650 వరకు పెరిగింది. ఈ ఏడాది మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధరకు మించి ఎప్పుడు పెరగలేదు. దీంతో రైతులు సీసీఐకే విక్రయించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడి తగ్గడంతో పాటు గిట్టుబాటు ధర లేక పత్తి రైతులు ఈ ఏడాది నష్టాల పాలయ్యారు. అయితే రైతులు తమ వద్ద ఉన్న పత్తి మొత్తం అమ్ముకున్నాక ధరలకు రెక్కలొచ్చాయి. సీసీఐ వారు మొదట క్వింటా రూ. 7,020, తర్వాత రూ.6,920 చొప్పున కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో పత్తి క్వింటా రూ.7,650 వరకు పలుకుతోంది. అంటే ఇప్పటికే అమ్ముకున్న రైతులు క్వింటాకు రూ.700 వరకు నష్టపోయారు. ప్రస్తుతం వ్యాపారులు, జిన్నింగ్ మిల్లర్ల వద్ద మాత్రమే పత్తి ఉండడం గమనార్హం.

సంకల్పిస్తే సాధ్యమే..

- భద్రాద్రిలో మినీ ట్యాంక్‌బండ్ కల సాకారం చేయాలి
- సీఎం కరుణించారు.. అధికారులే చొరవ చూపాలి
- నిర్మాణం పూర్తయితే భద్రగిరికి మరో 'మణిహారం'
- ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు మరింత ఊతం



గోదావరి తీరం వెంట ఉన్న కరకట్ట

భద్రాచలం: ఒక వైపు పవిత్ర గోదావరి జల ప్రవాహం.. మరోవైపు వినసొంపుగా వినిపించే రామదాసు కీర్తనలు, కరకట్టపై ఆహ్లాదకరమైన పచ్చటి చెట్లు.. వెరసి భక్తులను, పర్యాటకులను ఆకట్టుకునే సన్నివేశాలు.. ఇవన్నీ భద్రాచలంలోని కరకట్ట పైనుంచి వీక్షించే అవకాశం సాధ్యమేనా అంటే.. అధికారులు చూపే చొరవపైనే ఆధారపడి ఉంటుంది. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్, ఖమ్మంలో లకారం ట్యాంక్‌బండ్‌కు మించి సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు కొలువై ఉన్న భద్రాచలం గోదావరి ఒడ్డున మినీ ట్యాంక్‌బండ్ నిర్మించాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన అనంతరం ఈ ఊహకు మరింత ఊపొచ్చింది.


అభివృద్ధికి తొలి అడుగు..

భద్రాచలం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానంగా ఇరిగేషన్, దేవాదాయ శాఖలతో సమీక్ష నిర్వహించారు. భద్రాచలం పట్టణం, దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తదనుగుణంగా ప్రణాళికలు, నివేదికలను నెల రోజుల్లోపు అందజేయాలని ఆదేశించారు. నిధుల గురించి ఆలోచించకుండా భక్తులు, స్థానికులు, పర్యాటకులకు మేలు జరిగేలా రూపకల్పన చేయాలని సూచించారు. దీంతో భద్రాచలం అభివృద్ధికి తొలి అడుగు పడింది. అయితే పట్టణంలో ఆధ్యాత్మిక, పర్యాటక రంగం మరింత మెరుగుపడేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని పలువురు కోరుతున్నారు. భద్రాచలం వచ్చిన భక్తులకు పర్ణశాల మినహా చూడదగిన పర్యాటక ప్రాంతం మరొకటి లేదు. సేద తీరేందుకు, ఆహ్లాదకర అనుభూతి పొందేందుకు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న చిన్న పార్కే పెద్ద దిక్కుగా మారింది. బ్రిడ్జి సెంటర్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ఉన్న కరకట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దితే భద్రాచలం క్షేత్రానికి మరో మణిహారంగా మారనుంది. మధ్యలో టీ, కాఫీ షాపులను, వ్యూ పాయింట్‌లను ఏర్పాటు చేసి పర్యాటకులను మరింత ఆకర్షించవచ్చు. భద్రాచలం క్షేత్ర, రామాయణ ఇతివృత్తాలతో పాటుగా ఆదివాసీల జీవన శైలి తెలిపేలా మ్యూజియాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లు, రంగురంగుల ఫౌంటెన్‌ల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఇక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులకు గోదావరిలో జలవిహారం చేసే అవకాశం కలుగుతుంది. తద్వారా అటు పర్యాటక రంగాభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

తొలగనున్న డంపింగ్ యార్డు సమస్య..

గోదావరి నది కరకట్టపైనే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డు కొద్ది సంవత్సరాలుగా భద్రాద్రి వాసులకు, భక్తులకు పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు ట్యాంక్‌బండ్ నిర్మిస్తే ఈ సమస్య తీరనుంది. డంపింగ్ యార్డును కరకట్ట నుంచి మనుబోతు చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలోకి మారుతుంది. ఇక్కడ ఇప్పటికే రూ.80 లక్షల వ్యయంతో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డ్రైవేస్ట్ రిసోర్స్ కలెక్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది అమల్లోకి వస్తే కరకట్ట సుందర వనంగా మారేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ మేరకు కలెక్టర్ ప్రియాంక ఆల ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ దిశగా ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయించాలని పలువురు కోరుతున్నారు.

మినీ ట్యాంక్‌బండ్ కల సాకారం చేయాలి



భద్రాచలంలో భక్తులు, పర్యాటకులు, స్థానికులకు కలగా ఉన్న మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రభుత్వం నిర్మించాలి. ట్యాంక్‌బండ్ నిర్మాణంతో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా వీటిపై ఆధారపడే వారికి జీవనోపాధి లభిస్తుంది. భద్రాచలం దివ్యక్షేత్రానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వస్తుంది.

– పరిమి సోమశేఖర్, భద్రాచలం

క్లుప్తంగా

పెద్దమ్మగుడిలో వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీ కనక దుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో నాలుగు వ్యాపార దుకాణాలకు, చీరలు, తలనీలాలు పోగు చేసుకునేందుకు బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలంపాటను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి పి.భేల్‌సింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, సభ్యులు గంధం వెంగళరావు, సువాలి, బండి చిన్న వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, వెంకటరామారావు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

శ్రీకనకదుర్గ(పెద్దమ్మగుడి)లో 2023 డిసెంబర్ 20 నుంచి ఈ నెల మార్చి 13వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఆదెర్ల కోమల (32) మంగళవారం కూలి పనులకు ఆటోలో వెళుతుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్, కారు ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రుగొండ : చంద్రుగొండలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో రోడ్డు దాటుతుండగా కొత్తగూడెం నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తిప్పనపల్లికి చెందిన గాదె ఉపేందర్ (బొర్రయ్య), రామిశెట్టి బాలప్రసాద్ (బాల)లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులకు పీహెచ్‌సీ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బొమ్మల దుకాణంలో నగదు చోరీ

సుజాతనగర్: శివాలయం సమీపంలోని బొమ్మల దుకాణంలో నగదు చోరీ అయిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. చంద్రుగొండ మండలం, రేపల్లెవాడకు చెందిన సట్టు పుల్లయ్య కొన్నేళ్లుగా శివాలయం ఎదురుగా బొమ్మల దుకాణం నిర్వహిస్తున్నాడు. పుల్లయ్య దంపతులు మంగళవారం దుకాణం మూసివేసి ఆస్పత్రికి వెళ్లారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం లోపలికి ప్రవేశించి రూ.50 వేల నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయంలోని సీసీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఐటీడీఏ వాహనం దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఐటీడీఏ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిలిపిన స్కార్పియో వాహనం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ మేరకు ఏపీఓ డేవిడ్ రాజ్ బుధవారం వివరాలు వెల్లడించారు. దాదాపు 25 ఏళ్ల నాటి స్కార్పియో వాహనం నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలు చెలరేగకుండా అదుపు చేశారు.

గంజాయి స్వాధీనం

పాల్వంచరూరల్: గంజాయి, ముగ్గురు నిందితులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని తోగ్గూడెం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి నిఘా ఉంచారు. ఈ క్రమంలో ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి రూ.5 లక్షల విలువైన ఎండు గంజాయి తీసుకొస్తుండగా పట్టుకున్నారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన షకీర్, మోసు, స్వరూప్‌లను అరెస్ట్ చేయగా, బషీర్, మున్నా అనే మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక వాహనాలు సీజ్

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. మొర్రేడు వాగు నుంచి లారీ, ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని పాల్వంచ వైపు వస్తుండగా శ్రీనివాస కాలనీ సమీపంలో పట్టుకుని, వాహనాలను స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కుమార్, ట్రాక్టర్ డ్రైవర్ రాంబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

గృహజ్యోతిపై ఆందోళన



చుంచుపల్లిలో జీరో బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

- అర్హత ఉన్నా అందని జీరో విద్యుత్ బిల్లులు
- ప్రజాపాలన ఆర్జీల ఆన్‌లైన్‌లో పొరపాట్లు
- సేవా కేంద్రాల్లో చేర్పులు, మార్పులకు అవకాశం
- కొత్త దరఖాస్తులకు అందుబాటులో లేని వెబ్‌సైట్

చుంచుపల్లి: గృహజ్యోతి పథకం అమలుతీరుపై గందరగోళం నెలకొంది. పలువురు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి, ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నా పథకం వర్తించడంలేదు. 'జీరో' విద్యుత్ బిల్లులు రావడంలేదు. దరఖాస్తు సమయంలో కొందరు విద్యుత్ వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్లు వివరాలను ఆన్‌లైన్ చేసే క్రమంలో తప్పులు దొర్లడంతో ఈ సమస్య తలెత్తింది. దీంతో దాదాపు 30 శాతం కుటుంబాలకు ఈ పథకం అందకుండా పోతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి గృహజ్యోతి పథకం అమలు చేస్తోంది. జిల్లాలో 2,82,435 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఇందులో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలు 1,34,866 ఉన్నట్లు అధికారులు తేల్చారు. జిల్లావ్యాప్తంగా 3,33,225 ప్రజాపాలన దరఖాస్తులు రాగా, వాటిలో గృహజ్యోతి పథకానికి 2,38,307 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు 85 శాతం విద్యుత్ బిల్లులను వినియోగదారులకు అందజేశారు. వాటిలో వందల సంఖ్యలో అర్హులకు జీరో బిల్లులు రాలేదు. ప్రభుత్వం పేర్కొన్నట్లు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించినా తమకు లబ్ధి చేకూరడం లేదని అర్హులు వాపోతున్నారు. దరఖాస్తులు స్వీకరించిన సమయంలో సరైన మార్గదర్శకాలు రాకపోవడంతో అద్దె ఇళ్లలో నివసించేవారు దరఖాస్తు చేసుకోలేదు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు గత నెలలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను వివరాలను సేకరించారు. కానీ ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల వివరాలనే పరిగణనలోకి తీసుకోగా, అద్దె ఇళ్లలో ఉన్నవారికి జీరో బిల్లులు రాలేదు.

ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సవరణలు..

గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ రాయితీ వర్తించని వారు ఆందోళన చెందడంతో సవరణలకు అవకాశం కల్పించారు. ఇందుకోసం మండల కేంద్రంలో ఒకటి, మున్సిపాలిటీల్లో రెండు, మూడు చొప్పున ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జీరో బిల్లులు రానివారంతా తరలిరావడంతో సేవా కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. దరఖాస్తుల కంప్యూటరీకరణలో విద్యుత్ సర్వీసు నంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు సక్రమంగా నమోదు చేయకపోవడంతో తప్పులు దొర్లాయి. అందువల్లే జీరో విద్యుత్ బిల్లులు రాలేదని తెలిసింది. అయితే ధ్రువపత్రాలు సరిగా జతచేయలేదని, సర్వీస్ నంబర్ తప్పుగా వేశారని, రేషన్ కార్డుకు విద్యుత్ బిల్లు అనుసంధానం కాలేదని అధికారులు పేర్కొంటున్నారు. పథకాలు వర్తించనివారు ఆహార భద్రత, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లులతో బారులుదీరుతుండగా, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కేవలం మార్పులు, చేర్పులు మాత్రమే చేపడుతున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అద్దె ఇళ్లవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు	2,82,435
గృహజ్యోతి దరఖాస్తులు	2,38,307
గృహజ్యోతికి అర్హులు	1,34,866
ఇందులో జీరో బిల్లులు	1,25,508
జీరో బిల్లులకు చెల్లించిన సబ్సిడీ	రూ.3.55 కోట్లు



లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామానికి చెందిన రేపాల మహేష్ తన భార్య విజయ పేరు మీద ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. అర్హత ఉన్నా ఇతనికి జీరో బిల్లు రాలేదు. ప్రజాపాలన సేవా కేంద్రంలో తెలుసుకోగా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారుల పొరపాటు వల్లనే మహేష్‌కు గృహజ్యోతి పథకం వర్తించలేదు.

అద్దె ఇల్లు అని దరఖాస్తు చేసుకోలేదు



నేను బాబూక్యాంపులో అద్దె ఇంట్లో నివసిస్తున్నాను. ప్రజాపాలన సమయంలో అద్దె ఇంట్లో ఉన్న వారికి గృహజ్యోతి వర్తించదని అధికారులు చెప్పడంతో అప్పట్లో దరఖాస్తు చేసుకోలేదు. ఆ తర్వాత విద్యుత్ సిబ్బందికి వివరాలు ఇచ్చాను. ఇప్పుడు జీరో బిల్లు రాలేదని ప్రజాపాలన సేవా కేంద్రంలో సంప్రదించగా కొత్త దరఖాస్తు కోసం వెబ్‌సైట్ అందుబాటులో లేదని చెప్పారు.

– కొండే రాంబాబు, బాబూక్యాంపు

సాగర్ కాల్వల్లోకి గోదావరి జలాలు!



లింక్ కెనాల్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల, పొంగులేటి, ఖమ్మం కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి తదితరులు

- సీతారామ ప్రాజెక్టు నుంచి వైరా రిజర్వాయర్‌కు మళ్లింపు
- వినోభానగర్ నుంచి తిమ్మరావుపేట వరకు లింక్ కెనాల్
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల

వైరా: కృష్ణా జలాలు పారుతున్న కాల్వల్లోకి గోదావరి నీటిని మళ్లించాలనే ఆలోచన కార్యరూపం దాలుస్తోంది. తద్వారా సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరు అందనుంది. ఈమేరకు లింక్ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.99.16కోట్లు మంజూరు చేయగా.. బుధవారం సాయంత్రం వైరా రిజర్వాయర్ సమీపాన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయగా... మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొరాయించిన హెలీకాప్టర్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధిర నుంచి వైరాకు హెలీకాప్టర్‌లో రావాల్సి ఉంది. అయితే, మధిరలో హెలీకాప్టర్ మొరాయించడంతో రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఇక్కడ లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశాక ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ చీకటి పడుతుండడం.. అప్పటికే హెలీకాప్టర్ వైరాకు చేరుకోవడంతో డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్ హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఆగస్టు నాటికి పంటలకు గోదావరి జలాలు

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు ఆగస్టు నాటికి పంటలకు చేరేలా నీటి పారుదల శాఖాధికారులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. వైరాలో లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో నీళ్లు లేకపోవడంతో వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని సాగర్ ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు గోదావరి జలాలను సాగర్ కాల్వలకు అనుసంధానం చేయాలనే తన కల మేరకు స్వాతంత్ర దినోత్సవం నాటికి పనులు పూర్తిచేయాలన్నారు. అయితే, వైరా రిజర్వాయర్‌లోకి మాత్రం జూన్, జూలై నాటికి జలాలు చేరేలా చూడాలన్నారు. ఈ పనులు పూర్తయితే 1.50 లక్షల ఎకరాలకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి చేతుల్లోనే ఆర్థిక శాఖ కూడా ఉన్నందున నిధుల విషయం ఆయనే చూసుకుంటారని, ఒకవేళ నిధులు మంజూరు కాకపోతే తన స్వగ్రామమైన లక్ష్మీపురం రానివ్వకండని మంత్రి తుమ్మల చమత్కరించారు. వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, డాక్టర్ మట్టా రాగమయి, ఖమ్మం కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

జలాల మళ్లింపు ఇలా...

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్ వరకు కాల్వల తవ్వకం పూర్తయింది. మొదట రూపొందించిన ప్రణాళిక ప్రకారం అక్కడి నుంచి గోదావరి జలాలు నేరుగా పాలేరుకు వెళ్లాలి. కానీ వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సాగు అవసరాలకు అందించేలా లింక్ కెనాల్ నిర్మాణానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనల ప్రకారం... ఖమ్మం మీదుగా వెళ్తూ ఏన్కూరు మండలం తిమ్మరావుపేట వరకు ఉన్న ఎన్నెస్పీ ప్రధాన కాల్వ వరకు వినోభానగర్ నుంచి 9 కి.మీ. మేర లింక్ కెనాల్ నిర్మిస్తారు. తద్వారా కాల్వల్లోకి గోదావరి జలాలను తరలించి అక్కడి ఎస్కేప్ లాక్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. అంతేకాకుండా మెయిన్ కెనాల్ ద్వారా ముందుకు సాగే జలాలు సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని కాల్వలు, జలాశయాలకు చేరడంతో ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని చెబుతున్నారు.

భవిష్యత్ అవసరాలే కీలకం

- రాష్ట్రంలోనే మోడల్‌గా ఖమ్మం మెడికల్ కాలేజీ
- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన మంత్రులు



మ్యాప్ ఆధారంగా వివరాలు పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం అర్బన్: భవిష్యత్ అవసరాలే కీలకంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి రెవెన్యూ పరిధిలోని 137, 138, రఘునాథపాలెం రెవెన్యూ పరిధి 218 సర్వే నంబర్‌లోని 30 ఎకరాల ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు అధికారులు గుర్తించారు. ఈమేరకు ప్రతిపాదిత స్థలాన్ని మంత్రులు కలెక్టర్ వీ.పీగౌతమ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏటా విద్యార్థుల సంఖ్య పెరగనుండగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విశాలమైన ప్రాంగణంలో భవన నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు కూడా అందుబాటులోకి రానున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని.. తద్వారా రాష్ట్రంలోనే ఖమ్మం మెడికల్ కాలేజీని మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు స్వామి, లూథర్ విల్సన్, మెడికల్ కళాశాల అధికారులు, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

రామచందర్ ఎంపిక హర్షణీయం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా రామగుండం ప్రాంతానికి చెందిన వడ్డేపల్లి రామచందర్‌ను ఎంపిక చేయడం హర్షణీయమని సింగరేణి లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం రామచందర్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు.

ఒకే కాన్పులో నాలుగు మేక పిల్లలు



నాలుగు పిల్లలతో మేక

టేకులపల్లి: మండలంలోని బద్దుతండా పంచాయతీ మద్దిరాలతండాలో రైతు బాణోతు భీముడుకు చెందిన మేక బుధవారం ఒకే కాన్పులో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. నాలుగు పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

సమష్టి కృషితో లక్ష్యాల సాధన



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్ట లక్ష్యాలను ఎంచుకుని, రక్షణ పాటిస్తూ సమష్టి కృషితో వాటిని సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మణుగూరు ఏరియాలోని ఓసీ–2, 4ను బుధవారం సందర్శించిన ఆయన మాట్లాడారు. ఏరియాకు నిర్దేశించిన 119.50 లక్షల టన్నుల నాణ్యమైన బొగ్గు వెలికితీతకు కార్మికులు, యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఏరియా నుంచి భద్రాద్రి ప్లాంట్, ఇతర పరిశ్రమలకు నిరాటంకంగా బొగ్గు పంపించడంపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, దుమ్ము,ధూళి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఓబీ కంపెనీల యాజమాన్యాలను ఆదేశించారు. కాగా, పీకేఓసీ విస్తరణకు పర్యావరణ అనుమతులు లభించినందున మరో 7లక్షల బొగ్గు ఉత్పత్తి చేయొచ్చని డైరెక్టర్ తెలిపారు. అనంతరం మరో డైరెక్టర్ డి.సత్యనారాయణరావుతో కలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, అధికారులు నర్సిరెడ్డి, వెంకటరమణ, లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్రీనివాసచారి, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్, శేషగిరి, చిట్టా శ్రీనివాస్, షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

- తప్పించుకున్న పలువురు మావోయిస్టులు
- ఆదివాసీ మహిళకు గాయాలు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోగా ఓ ఆదివాసీ మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన బీజాపూర్ జిల్లాలోని బైరంగడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ కథనం ప్రకారం.. బైరంఘడ్ పోలీస్‌స్టేషన్ పరిధి బోడ్గా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు మంగళవారం కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరుపుకుంటూ బోడ్గా గ్రామం వైపు పారిపోయారు. వారి వెంబడిస్తూ పోలీసు బలగాలు బోడ్గా గ్రామానికి చేరుకోగా, అప్పటికే గ్రామంలోకి చేరుకున్న మావోయిస్టులు మరోసారి మళ్లీ కాల్పులు జరపడంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో బోడ్గా గ్రామానికి చెందిన రాజే ఓయం అనే ఆదివాసీ మహిళకు బుల్లెట్ గాయాలయ్యాయి. కాల్పుల అనంతరం మావోయిస్టులు అక్కడ నుంచి తప్పించుకొని అడవిలోకి పారిపోయారు. గాయపడ్డ మహిళను బైరంగడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం, జగదల్పూరు వైద్యశాలకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. కాగా తప్పించుకున్న మావోయిస్టుల కోసం బోడ్గా సమీప అటవీ ప్రాంతంలోకి అదనపు బలగాలను తరలించి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. అయితే ఈఏడాది జనవరి 30న బోడ్గా గ్రామంలో ఇదే తరహాలో జరిగిన ఎదురుకాల్పుల్లో గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ వ్యక్తి మృతి చెందగా ఇప్పుడు తాజాగా పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆదివాసీ మహిళ గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది.

అరుదైన 'గిరి నాగుపాము' ప్రత్యక్షం



అరుదైన గిరి నాగుపాము

అశ్వారావుపేటరూరల్: దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంచరించే చాలా అరుదైన ఓ 'గిరి నాగు పాము' బుధవారం కనిపించింది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల గోపన్నగూడెం గ్రామం శివారులో మాజీ సర్పంచ్ గొంది లక్ష్మణ్‌రావు వ్యవసాయ పొలంలో ఈ పాము ప్రత్యక్షమైంది. ఈ పాము దాదాపు 12 నుంచి 15 అడుగుల పొడవు దాకా ఉంటుంది.

బొగ్గు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు



పోలీసులు పట్టుకున్న వాహనాలు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టు నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్లను టేకులపల్లి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. నిబంధనల ప్రకారం 14 టైర్ల టిప్పర్‌లో 28 టన్నుల బొగ్గు, 12 టైర్ల టిప్పర్‌లో 23 టన్నుల బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. కానీ ఓవర్‌లోడింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకుని, కేసు నమోదు చేసుకుని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టిన లారీ

- గంటన్నర పాటు నిలిచిన రాకపోకలు



రహదారిపై నిలిచిపోయిన లారీ

కామేపల్లి: ప్రమాదవశాత్తు కల్వర్టును లారీ ఢీకొట్టగా... గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలు.. ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై కామేపల్లి మండలం పండితాపురం బైపాస్ సమీపాన కల్వర్టును బుధవారం ఉదయం ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈమేరకు లారీ ప్రధాన రహదారిపై అడ్డంగా నిలిచిపోవడంతో గంటన్నర పాటు ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వాహనాలను పండితాపురం మీదుగా ముచ్చర్ల క్రాస్ రోడ్డుకు మళ్లించారు. అనంతరం జేసీబీతో లారీని పక్కకు తొలగించాక రాకపోకలు మొదలయ్యాయి.

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే కర్తవ్యం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు అసలు రాజ్యాంగమే లేకుండా మనువాదాన్ని అమలుచేసేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దీన్ని తిప్పికొడుతూనే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడడం ద్వారా ప్రజా మద్దతును పొందగలుగుతామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. వేసవి తీవ్రతతో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆరు గ్యారంటీల అమలులో అవకతవకలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ సాగు, తాగునీటి సమస్య ఉన్నందున పాలేరు పాత కాల్వకు సాగర్ నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్ము శ్రీను, బుగ్గవీటి సరళ, షేక్ బషీరుద్దీన్, నండ్ర ప్రసాద్, ఊరడి సుదర్శన్‌రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, ఎడవల్లి రమణారెడ్డి, అంగిరేకుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.